# దశ

నిజం.. నిర్భయంగా..

WWW.
DASHANEWS
.COM

సోమవారం
25 08 2025


సంపుటి 1 సంచిక 117

పేజీలు : 02

UDYAM /
TS-09-0148996


## చరిత్రలో ఈ రోజు





1609: గెలీలియో గెలీలి మొదటిసారిగా తాను తయారు చేసిన టెలిస్కోపు ప్రదర్శించాడు. (చిత్రంలో)
1867: ఆంగ్ల రసాయన శాస్త్రవేత్త, భౌతిక శాస్త్రవేత్త మైకేల్ ఫెరడే మరణం (జ.1791).
1952: శ్రీలంకకు చెందిన మాజీ క్రికెట్ ఆటగాడు దులీప్ మెండిస్ జననం.
1953: తెలుగు సాహితీకారుడు సురవరం ప్రతాపరెడ్డి మరణం
1962: బంగ్లాదేశ్ కు చెందిన రచయిత్రి తస్లీమా నస్రీన్ జననం.
1969: కార్మిక నాయకుడు, ఉర్దూకవి మఖ్దూం మొహియుద్దీన్ మరణం
1999: తత్వవేత్త, చిత్రకారుడు, రచయిత, కవి సూర్యదేవర సంజీవదేవ్ మరణం (జ.1924).
2012: చంద్రునిపై మొట్టమొదట కాలుమోపిన వ్యక్తి నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ మరణం. (జ.1930)

# ఉద్యోగాల జాతర

### వైద్య ఆరోగ్యశాఖలో 1700.. రెవెన్యూ శాఖలో 217 కొలువుల భర్తీకి కసరత్తు

**దశ, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సేవల మెరుగుదల కోసం ఒక ముఖ్యమైన అడుగు వేసింది. వైద్యారోగ్య శాఖ పరిధిలోని తెలంగాణ వైద్య విధాన పరిషత్ , ఆర్టీసీ ఆసుపత్రులలో మొత్తం 1,623 వైద్యుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో టీవీవీపీ ఆసుపత్రుల్లో 1,616 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు, ప్రకటనను వైద్య ఆరోగ్య సేవల నియామక బోర్డు విడుదల చేసింది. ఆన్‌లైన్ దరఖాస్తులు సెప్టెంబరు 8 నుంచి సెప్టెంబరు 22 వరకు అందుబాటులో ఉంటాయి. అభ్యర్థులు ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు విడివిడిగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పోస్టులను మల్టీజోన్1 (858), మల్టీజోన్2 (765) పరిధిలో భర్తీ చేయనున్నారు. వివిధ స్పెషలిస్టుల పోస్టులు కూడా ఈ నోటిఫికేషన్‌లో భాగంగా ఉన్నాయి.ఈ నియామకాల ద్వారా ఎంపికైన వైద్యులు ప్రైవేటు ప్రాక్టీస్ చేయడానికి వీలు లేదని నోటిఫికేషన్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ తాజా నియామకాలతో పల్లె ప్రజలకు వైద్యసేవలు అందించే జిల్లా, ఏరియా ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యుల లభ్యత గణనీయంగా పెరుగుతుంది. ప్రస్తుతం కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న వైద్యులను ప్రోత్సహించడానికి.. వారికి 20 పాయింట్లు అదనంగా కలపనున్నారు. ఇక రెవెన్యూ శాఖలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు కూడా శుభవార్త. ప్రభుత్వం ఈ శాఖలో మరిన్ని పోస్టులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో రెవెన్యూ శాఖలో మొత్తం 217 కొత్త పోస్టుల భర్తీకి మార్గం సుగమమైంది. ఈ పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయనున్నారు. తెలంగాణలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను గుర్తించి, వాటిని భర్తీ చేయడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చాలా కాలంగా నిలిచిపోయిన నియామక ప్రక్రియలు తిరిగి ప్రారంభం కావడం వారికి ఆశను కల్పిస్తోంది. తాజాగా మంజూరైన 217 పోస్టులు ఏడు జిల్లాల్లో ఉన్నాయి. ఈ పోస్టులకు సంబంధించి త్వరలోనే అధికారిక నోటిఫికేషన్ విడుదల కానుంది.





# లైఫ్ సైన్సెస్‌కు కేంద్రంగా తెలంగాణ

### 'ఆసియా పసిఫిక్ బయో డిజైన్ ఇన్నొవేషన్ సమ్మిట్ 2025' లో సీఎం రేవంత్‌రెడ్డి

దశ , హైదరాబాద్ :తెలంగాణ లైఫ్ సైన్సెస్‌కు కేంద్రంగా ఉందని, బయో టెక్నాలజీ, ఫార్మా, మెడికల్ టెక్నాలజీ రంగాల్లో నూతన ఆవిష్కరణలకు అవసరమైన మద్దతును ఇవ్వడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చెప్పారు. హైదరాబాద్ ఏఐజీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో జరిగిన 'ఆసియా పసిఫిక్ బయో డిజైన్ ఇన్నొవేషన్ సమ్మిట్ 2025' లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ వేదికగా "ఇన్నొవేషన్ ఆఫ్ భారత్ ది బయోడిజైన్ బ్లూప్రింట్"ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, బయోడిజైన్ విధానం ఉపయోగించి వైద్య ఉత్పత్తుల ఆవిష్కరణల విషయంలో ప్రభుత్వం అన్ని విధాలుగా మద్దతునిస్తుందని చెప్పారు. మాన్యుఫాక్చరింగ్ స్థాయి నుంచి నూతన ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్ అభివృద్ధి చెందడం శుభ సూచకమని అన్నారు. "భారతదేశంలో ఆరోగ్య సంరక్షణ, ఎదురవుతున్న సవాళ్లను అధిగమించడానికి స్వదేశీ ఆవిష్కరణలు ఎంతో అవసరం. అలాంటి పరిశోధనలకు, ఆవిష్కరణల కోసం తెలంగాణ మద్దతునివ్వడమే కాకుండా వైద్య డేటాను డేటా గోప్యతా ప్రమాణాలకు లోబడి అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఈ రంగంలో ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ డి. నాగేశ్వర రెడ్డి నాయకత్వంలో నూతన ఆవిష్కరణల కోసం పరిశోధనా కార్యక్రమాలు కొనసాగించడం అభినందనీయం. ఈ సమ్మిట్ లో ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్ రెడ్డి , బయోడిజైన్ ఇన్నొవేషన్ సమ్మిట్ చైర్మన్ డాక్టర్ రాజేశ్ కలపల , హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ జీవీ రావు , సెంటర్ ఫర్ బయోడిజైన్ (స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీ) డైరెక్టర్ డాక్టర్ అనురాగ్ మైరల్ తో పాటు వైద్య పరిశోధనా రంగంలో వివిధ దేశాలకు చెందిన వైద్య నిపుణులు పాల్గొన్నారు.

## సురవరం రెడ్డి మరణం తీరని లోటు: సీఎం



**దశ, హైద్రాబాద్:** సీపీఐ నాయకుడు కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మరణం నిరుపేదలకు, బహుజనులకు, సిద్ధాంతపరమైన రాజకీయాలను శ్వాసగా నడుస్తున్న ప్రతి ఒక్కరికీ తీరని లోటు అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూం భవన్‌లో కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి గారి భౌతిక కాయానికి ముఖ్యమంత్రి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సురవరం సుధాకర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. సీపీఐ నేతలు డి.రాజా గారు, కె.నారాయణ , కూనంనేని సాంబశివరావు , అజీజ్ పాషా తో పాటు అనేకమంది నాయకులను ముఖ్యమంత్రి కలుస్తూ సురవరం సేవలను స్మరించుకున్నారు. జీవితాంతం సిద్ధాంతపరమైన విలువలతో కూడిన రాజకీయంతో పనిచేసిన సురవరం సుధాకర్ రెడ్డి ని శాశ్వతంగా గుర్తుంచుకునే విధంగా మంత్రివర్గంలో చర్చించి సముచితమైన నిర్ణయం తీసుకుంటాం.." అని ముఖ్యమంత్రి తన సందేశంలో పేర్కొన్నారు.


# ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు.. అనుమానించి ముక్కలు చేశాడు

### రంపంతో భార్యను ముక్కలుగా కోసి శరీర భాగాలను మూసీ నదిలో పడేసిన భర్త
### మేడ్చల్ జిల్లా జరిగిన అమానవీయఘటన

దశ, మేడ్చల్ మల్కాజిగిరి: మేడ్చల్ జిల్లా జరిగిన అమానవీయ ఘటన అంతటా కలకలం రేపుతోంది. మేడిపల్లి పరిధిలోని బాలాజీహిల్స్ కాలనీలో నివసిస్తున్న ఓ వ్యక్తి గర్భిణీ అయిన భార్యను అతి క్రూరంగా హతమార్చిన ఘటన స్థానికులను తీవ్రంగా కలచివేస్తోంది. రంపంతో భార్యను ముక్కలు ముక్కలుగా కోసి శరీర భాగాలను మూసీ నదిలో పడేశాడు ఓ భర్త. దంపతుల మధ్య కొన్నాళ్లుగా చెలరేగుతున్న కలహాలే హత్యకు దారి తీశాయని పోలీసులు అనుమానిస్తున్నారు. వికారాబాద్ జిల్లా కామారెడ్డి గూడకు చెందిన ఈ దంపతులు కొన్నాళ్ల కిందటే హైదరాబాద్‌లోని బోడుప్పల్ ప్రాంతానికి వలస వచ్చారు. వివరాల్లోకి వెళితే.. వికారాబాద్ జిల్లా కామారెడ్డిగూడకు చెందిన స్వాతి ( 25), మహేందర్ రెడ్డి ఇరువురూ ప్రేమించి వివాహం చేసుకున్నారు. హైదరాబాద్ వచ్చి నెల కూడా అవలేదు. మహేందర్ ర్యాపిడో నడుపుతుంటాడు. అయితే, కొంతకాలంగా దంపతులు ఇరువురూ తరచూ గొడవపడుతున్నట్లు తెలుస్తోంది. మూడు రోజుల క్రితం (ఆగస్ట్ 22) మధ్యాహ్న సమయంలో ఐదు నెలల గర్భవతిగా స్వాతిని ఆమె భర్త మహేందర్ రెడ్డి అత్యంత దారుణంగా హతమార్చినట్టు పోలీసులు వెల్లడించారు. మృతదేహాన్ని ముక్కలుగా నరికి కవర్లలో పెట్టి వాటిని మూసీ నదిలో పడేసే ప్రయత్నం చేశాడు. తల, చేతులు, కాళ్లు వేరు చేసి విభిన్న ప్రాంతాల్లో వదిలిపెట్టినట్లు అతడు అంగీకరించినట్టు తెలుస్తోంది. మొండాన్ని మాత్రం ఇంట్లోనే ఉంచడంతో దుర్వాసన వచ్చి స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కవర్లను పరిశీలించగా మహేందర్ ఇంట్లో స్వాతి మొండెం కనిపించింది. దీంతో నిందితుడు మహేందర్ రెడ్డిని పోలీసులు వెంటనే అరెస్టు చేశారు. స్వాతి తల్లి మీడియాతో మాట్లాడుతూ, తమ కూతురు డిగ్రీ చదువుతున్న సమయంలో మాయమాటలతో ఆకర్షించి మహేందర్ ఇంట్లోంచి తీసుకెళ్లి ప్రేమ వివాహం చేసుకున్నాడని తెలిపింది. మిగిలిన శరీర భాగాల కోసం మూసీ నదిలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. కేసు తీవ్రతను దృష్టిలో ఉంచుకుని లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.




## 'కొప్పుల'పై చర్యలు తీసుకోవాలి



**దశ, ఎల్బీనగర్ :** ఓ ప్రైవేట్ సివిల్ కాంట్రాక్టర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డికి మధ్య జరుగుతున్న వివాదం మరో మలుపు తిరిగింది. 'ఎల్బీనగర్ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు గంజాయి బ్యాచ్' అని అనుచిత వ్యాఖ్యలు చేసిన కొప్పుల నర్సింహా రెడ్డిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ యువజన నాయకులు శనివారం ఎల్బీనగర్ ఏసీపీ, సీఐలను కలిసి ఫిర్యాదు చేశారు. నిరాధార వ్యాఖ్యలు చేసిన కొప్పుల నర్సింహారెడ్డి ఆధారాలుంటే బయట పెట్టాలని, లేకపోతే ముక్కు నేలకి రాసి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్పొరేటర్ కొప్పులతో ఉండేదే.. గంజాయి బ్యాచ్, ఆయన చేసేది గంజాయి వ్యాపారం అంటూ మండిపడ్డారు. స్వయానా ఆయన బామ్మర్ది, ఆయన అనుచరుడు గంజాయి తీసుకునే ఆధారాలను ఏసీపీ, సీఐలకు అందించామని, తగు చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్‌యూత్ విభాగం అధ్యక్షుడు రవి ముదిరాజ్, సీనియర్ నాయకులు మాధవరం నర్సింహారావు, తిలక్ రావ్, జక్కిడి రఘువీర్ రెడ్డి, శ్రీనాథ్, రవి, అఖిల్, సాయి, శివ, త్రిలోక్, వేణు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు వైద్యసామగ్రి అందజేత



**దశ, ఎల్బీనగర్:** వృద్ధులకు అవసరమైన వైద్యసామగ్రిని ఆదివారం హయత్ నగర్ కార్పొరేటర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పంపిణీ చేశారు. హయత్ నగర్ డివిజన్లోని రాఘవేంద్ర కాలనీలో భారతీయ కృత్రిమ అవయవాల తయారీ సంస్థ, సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, ఉచితంగా పరికరాలను అందజే శారు. వృద్ధులకు చక్రాల కుర్చీలు, వినికిడి యంత్రాలు, నెక్ బెల్టులు , నడుము బెల్టులు,నెక్ బెల్టులు, నీ క్యాప్స్ మొదలగు యంత్రాలను వినికిడి, కీళ్లనొప్పుల సమస్యలు ఉన్న వృద్ధులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వ శాఖ అనేక సేవా కార్యక్రమాల నిర్వహిస్తుందన్నారు. అలీయావర్ జంగ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్ డిజేబిలిటీస్ సంస్థ హయత్ నగర్ డివిజన్ లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీదేవి, రాఘవేంద్ర కాలనీ సీనియర్ సిటిజన్, సంక్షేమ సంఘం, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# బాల్యవివాహాలు అడ్డుకోవాలి: జస్టిస్ శామ్ కోషి



**దశ, ఎల్బీనగర్:** బాల్యవివాహాలు అడ్డుకుని, చిన్నారులకు ఉజ్వల భవిష్యత్ అందించాలని హైకోర్టు న్యాయమూర్తి పి.శామ్ కోషి అన్నారు. రంగారెడ్డి జిల్లాలోని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తులు పి.శామ్ కోషి, అభినంద్ కుమార్ శవిలి, చలపతి రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి పి.శామ్ కోషి మాట్లాడుతూ.. బాల్య వివాహాల నిర్మూలన కేవలం చట్టపరమైన సమస్య మాత్రమే కాదని, ఇది ఒక సామాజిక, మానవతా సమస్య అన్నారు. చట్టం ప్రకారం, బాలికలకు 18 ఏండ్లు, బాలురకు 21 ఏండ్ల వయస్సు నిండకముందే వివాహం చేయడం చట్టపరంగా నేరమని తెలిపారు. బాల్యవివాహాల పరిస్థితులను మార్చాలంటే, న్యాయవ్యవస్థ మాత్రమే కాదు, సమాజం మొత్తం కలిసికట్టుగా స్పందించాలని కోరారు. చైల్డ్ మ్యారేజ్ వ్యతిరేక చట్టాలు, సామాజిక బాధ్యతలపై న్యాయమూర్తులు అభినంద్ కుమార్ శవిలి, చలపతి రావు ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీ పంచాక్షరి మాట్లాడుతూ.. "చైల్డ్ మ్యారేజ్ నిర్మూలన కోసం రాష్ట్రవ్యాప్తంగా లీగల్ సర్వీసెస్ అధికారం కృషి చేస్తుందన్నారు. చట్ట పరిజ్ఞానంతో పాటు, బాధితులకు న్యాయ సహాయం అందించడమే మా లక్ష్యం" అని వివరించారు. రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీ కర్ణ కుమార్ మాట్లాడుతూ.. చైల్డ్ మ్యారేజ్ వల్ల బాలికలు విద్యను కోల్పోతారని, ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయన్నారు. అనంతరం జన్మతః డయాబెటిస్ తో బాధపడుతున్న లికిత అనే బాలికకు రంగారెడ్డి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ వీల్ చైర్ అందజేశారు. బార్ అసోసియేషన్ సభ్యులు ప్రతాప్ రెడ్డి, జనరల్ సెక్రటరీ కార్తిక్ లికితకు రూ.25వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో డీసీపీ ప్రవీణ్ కుమార్, బార్ అసోసియేషన్ సభ్యులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, మెంబర్ సెక్రటరీ పంచాక్షరి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణ కుమార్, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ రంగారెడ్డి ఇన్ చార్జి సెక్రటరీ శ్రీవాణి, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 21 కి.మీ. మారథాన్ను పూర్తి చేసిన
## రఘునాథ్ వెరబెల్లి




**దశ, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:** హైదరాబాద్ లో నిర్వహించిన 21.1 కిలోమీటర్లు మారథాన్ ను జిల్లాకు చెందిన బిజెపి రాష్ట్ర నాయకులు వెరబెల్లి రఘునాథ్ పూర్తి చేశారు. ఆదివారం హైదరాబాద్లోని నెక్లెస్ రోడ్ నుండి గచ్చిబౌలి స్టేడియం వరకు నిర్వహించిన 21.1 కిలోమీటర్ల మారథాన్ లో ఆయన తన కుమార్తె వెరబెల్లి అరుణిమ, జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలోని గౌతమ్ నగర్ కి చెందిన బుద్ధినేని స్వరుణ్ తో కలిసి పాల్గొని, మారథాన్ ను పూర్తి చేశారు.

## ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి : ఆగమయ్య కాలనీవాసులు



**దశ, ఎల్బీనగర్:** కాలనీకి రావడానికి, వెళ్లడానికి ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని ఆగమయ్య కాలనీవాసులు కోరారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని అగమయ్యా కాలనీలో ఆదివారం కాలనీవాసులతో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి సమావేశమయ్యారు. కాలనీవాసులు పలు సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. కాలనీలోకి రావడానికి సరియైన రహదారి లేదని, గతంలో వేసిన డ్రైన్స్ ప్రస్తుతానికి సరిపోవడం లేదని, పందులు, కుక్కల బెడద తీవ్రంగా ఉందని తెలిపారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించి, ట్రంక్ లైన్ పనులు వేగవంతం చేయాలని కోరారు. కాలనీ చివర కొందరు అక్రమంగా గుడిసెలు వేసుకొని మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ...కాలనీ సమస్యలను సమస్యలను రెండు రోజుల క్రితం జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లానన్నారు. కుక్కల బెడద గురించి అధికారులతో మాట్లాడానని, కాలనీ చివర డంపింగ్ యార్డును తొలగిస్తానని హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, మాజీ అధ్యక్షుడు జగదీష్ యాదవ్, నాయకులు టంగుటూరి నాగరాజు, జక్కిడి రఘువీర్ రెడ్డి, రుద్ర యాదగిరి నేత, కన్న, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

దశ
నిజం.. నిర్భయంగా..
02
సోమవారం
25-8-2025
WWW.
DASHANEWS
.COM



## ప్రత్యేక అధికారుల పాలనలో పేరుకుపోయిన ప్రజా సమస్యలు

❖ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎల్గూరి గోవింద్

**దశ సూర్యాపేట ప్రతినిధి:** ప్రత్యేక అధికారుల పాలనలో సూర్యాపేట పట్టణంలో ప్రజా సమస్యలు పెరిగిపోతున్నాయని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎల్గూరి గోవింద్ డిమాండ్ చేశారు. ఆదివారం సీతారాంపురంలోని 25వ వార్డులో జరిగిన సిపిఎం పార్టీ వన్ టౌన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక అధికారుల పాలనలో ప్రజా సమస్యలు పేరుకుపోతున్నాయన్నారు. పట్టణంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైందన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పేరుతో రోడ్లను విచ్చల విడిగా తువ్వినారని వాటిపై వెంటనే సిసి రోడ్లు నిర్మించాలన్నారు. షేక్ సైదులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఎం వన్ టౌన్ కార్యదర్శి వల్లపు దాసు సాయికుమార్, పట్టణ కమిటీ సభ్యులు షేక్ జహంగీర్, మామిడి పుల్లయ్య, కప్పల సత్యం, భాగ్యమ్మ, వట్టే ఎర్రయ్య, శశిరేఖ, పిట్టల రాణి, జయమ్మ, ఎల్లమ్మ, నాయకులు మల్లయ్య, బుద్ధ సంతోష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## శివారు ప్రాంతాలు, మున్సిపాలిటీ విలీన గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి

**దశ సూర్యాపేట ప్రతినిధి:** శివారు ప్రాంతాలు, విలీన గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించి దశలవారీగా ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్ లు అన్నారు. ఆదివారం సూర్యాపేట పట్టణంలోని 14వ వార్డు స్నేహ నగర్ కాలనీలో మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డితో కలసి వార్డులో కలియతిరిగి కాలనీ వాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో శివారు ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు.గత వారం రోజుల క్రితం కురిసిన భారీ వర్షాల కారణంగా వర్షం నీరు ఖాళీ స్థలాలలో నిల్వుడటం వలన దోమలు వస్తుండటంతో, పిల్లలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, త్వరలోనే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మెయిన్ సమస్యను కు పరిష్కరిస్తానని, తాత్కాలికంగా నీటి నిలువ ఉండకుండా ఇరిగేషన్ వారితో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యే విధంగా చూస్తానని తెలిపారు. ఖాళీ స్థలం యజమానులకు సమాచారం ఇచ్చి నీళ్లు నిలువ ఉండకుండా శుభ్రం చేసుకోవాలి తెలిపారు. స్నేహ నగర్ కాలనీ వాసుల సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## ధూప దీప నైవేద్య అర్చకులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

**దశ, తార్నాక:** గ్రామీణ ప్రాంత ధూప దీప నైవేద్య అర్చకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని అర్చక జేఏసీ చైర్మన్ ఉపేంద్ర శర్మ అన్నారు. తెలంగాణ అర్చక సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం హబ్సిగూడ లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జేఏసీ చైర్మన్ గంగ ఉపేంద్ర శర్మ మాట్లాడుతూ, "ప్రతి అర్చకుడు స్వతంత్రంగా ఎదగాలన్నారు. అర్చక సంఘాల్లో బీసీ వర్గాల వారికి పెద్దపీట వేశాం అన్నారు. తెలంగాణ అర్చక సమస్యల పరిష్కారానికి అనేక న్యాయ పోరాటాలు చేసి ఫలితాలు సాధించామని గుర్తు చేశారు. అర్చక వెల్ఫేర్ ఫండ్ ద్వారా చిన్న అర్చకులకు ప్రయోజనం చేకూర్చామని అన్నారు. 34వ సెక్షన్ ప్రకారం ఆలయాలకు ఆదాయం పెంచే దిశగా అర్చకులు కూడా కృషి చేయాలని, సహేతుకమైన డిమాండ్లతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దూప దీప నైవేద్యం పథకంలో కొందరు డబ్బులు వసూలు చేయడం సరికాదని అన్నారు. భక్తుల మద్దతు పొందడానికి అర్చకులు సత్సంబంధాలు కొనసాగించాలన్నారు. ఈ సమావేశంలో అర్చకుల హక్కులు, సంక్షేమం, ఆలయాల అభివృద్ధిపై పలు



కీలక తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు గట్టు శ్రీనివాస్ చార్యులు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనంద్ శర్మ, డిడిఎన్ అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు పెరంబుదూరి శ్రీకాంత్ స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ పెన్నా మోహన్ శర్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శటగోపం శ్రీనివాస్ చార్యులు, ఏడబ్ల్యూఎఫ్ సభ్యుడు జక్కాపురం నారాయణ, పూర్వ అధ్యక్షులు శ్రీనివాస్ సుదర్శన్, ముఖ్య సలహాదారు శ్రీకోటి జలందర్ లు పాల్గొన్నారు.

## దొంగతనం కేసులో నిందితుల అరెస్ట్

**దశ, మంచిర్యాల జిల్లా ప్రతినిధి :** జిల్లాలోని తాళ్లగురజాల పోలీస్ స్టేషన్ పరిధిలో ఇంటిలో దొంగతనం చేసిన నిందితురాలను అరెస్ట్ చేయడం జరిగిందని బెల్లంపల్లి రూరల్ సీఐ హనుక్ తెలిపారు. ఆదివారం సీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆగస్టు 22న ఇందూరు చంద్రశేఖర్ తన తమ్ముడు పెళ్లి సంబంధం చూడడానికి తాను, తన కుటుంబ సభ్యులతో కలిసి మంచిర్యాలకు వెళ్లి, తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం, బీరువా పగలగొట్టి అందులో రెండు తులాల బంగారు నెక్లెస్, 15 వేల రూపాయల నగదును దొంగలించారని ఫిర్యాదు చేశారు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు విచారణ ప్రారంభించారు. విచారణలో దొంగతనం జరిగిన రోజు వారింటికి గతంలో వారితో సంబంధం ఉన్న జిల్లాలోని కన్నాల గ్రామం గొల్లవాడ కు చెందిన పుల్లగొర్ల పుష్పలత నేరానికి పాల్పడిందని గుర్తించారు. పుష్పలత గతంలో చంద్రశేఖర్ వద్ద పనిచేసే సమయంలో పుష్పలత తాను పెళ్లి సంబంధాలు కుదురుస్తానని తెలుపగా, తన తమ్మునికి పెళ్లి సంబంధం చూడాలని చంద్రశేఖర్ కోరాడు. తరచూ చంద్రశేఖర్ ఇంటికి వస్తున్న పుష్పలత వారింట్లో దొంగతనం చేయాలని భావించి, సంబంధం ఉందని వారిని మంచిర్యాల కు పంపించి, ఇంట్లో ఎవరూ లేని



సమయంలో ఇంట్లోకి ప్రవేశించి, ఇంటి తాళం, బీరువా తాళం ఐరన్ రాడ్ తో పగలగొట్టి, 15 వేల రూపాయల నగదు, బంగారు ఆభరణాన్ని దొంగలించింది. ఆదివారం దొంగలించిన బంగారు ఆభరణాన్ని అమ్మేందుకు కన్నాల దగ్గర బుగ్గ టెంపుల్ కమాన్ దగ్గర ఆటో కొరకు ఎదురు చూస్తుండగా తాళ్లగురిజాల ఎస్ఐ రామకృష్ణ, ఏఎస్ఐ బాబాజీ, కానిస్టేబుల్ తిరుమల లు పుష్పలత ను అదుపులోకి తీసుకొని, ఆమె వద్ద నుండి బంగారు నెక్లెస్, 15 వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకొని, ఆమెను బెల్లంపల్లి జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చి అనంతరం రిమాండ్ కు తరలించారు. ఈ కార్యక్రమంలో తాళ్లగురిజాల ఎస్ఐ రామకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పేదల ఇండ్ల స్థలాలను కబ్జా చేస్తున్న పెద్దలు

❖ సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య

**దశ, అబ్దుల్లాపూర్మెట్ :** అర్హులైన పేదలకు ఇచ్చిన ఇండ్ల స్థలాలను పెద్దలు కబ్జాలు చేస్తున్నారని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య అన్నారు. అబ్దుల్లాపూర్మెట్ మండలం లష్కర్గూడ గ్రామ రెవెన్యూ సర్వే నెంబర్ 84లో ప్రభుత్వ ఉంది. ఇందులో అర్హులైన పేదలకు 1996లో సర్టిఫికెట్లు ఇచ్చారని.. ఇప్పుడు ఆ స్థలాన్ని కొందరు కబ్జా చేయాలని చూస్తుంటే.. సీపీఎం అబ్దుల్లాపూర్మెట్ మండల కమిటీ ఆధ్వర్యంలో భూమి మీదకు వెళ్లి.. జెండాలు పాతారు. ఈ సందర్భంగా పగడాల యాదయ్య మాట్లాడుతూ.. గత 29 ఏండ్ల క్రితం లష్కర్గూడ గ్రామానికి చెందిన నిరుపేదలకు ఇండ్ల స్థలాల సర్టిఫికెట్లు ఇచ్చారని తెలిపారు. 84 సర్వే నెంబర్లు మూడు ఎకరాల ప్రభుత్వ భూమి ఉంటుందని.. ఆ భూమిని కొంతమంది కబ్జా




చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించిన పేదల ఇండ్ల స్థలాల కోసం ఇచ్చిన భూమిని రక్షించి.. అర్హులైన లబ్దిదారులకు ప్లాట్లు చేసి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లబ్దిదారులతో కలసి 84 సర్వే నెంబర్లో ఉన్న భూమిని చదును చేసి.. అక్కడ జెండాలను పాతినట్లు తెలిపారు. లబ్దిదారులకు ప్లాట్లు దక్కేంతరకు సీపీఎం పార్టీ వారికి అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం అబ్దుల్లాపూర్మెట్ మండల కార్యదర్శి ఏర్పుల నర్సింహా, నాయకులు వర్కాల ముత్యాలు, మేడిపల్లి శ్రీశైలం, గుండె శివకుమార్, సత్యనారాయణ, సుమలత, శీను, బిక్షపతి, గుండె ఉషయ్య, శ్రీనివాస్, జి యాదయ్య, హరీష్, పట్టా సర్టిఫికెట్లు ఉన్న లబ్దిదారులందరూ పాల్గొన్నారు.

## టిడిపి పార్టీ జెండాలు తొలగించిన నిందితులను శిక్షించాలి



**దశ, మంచిర్యాల జిల్లా ప్రతినిధి :** జిల్లాలోని బెల్లంపల్లి పట్టణంలో హనుమాన్ బస్తి, బూడిదగడ్డ బస్తీలో తెలుగుదేశం పార్టీ (టిడిపి) జెండాలను గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారని, నిందితులను గుర్తించి, వారిని కఠినంగా శిక్షించాలని టిడిపి బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు ఠాకూర్ మణిరాం సింగ్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బెల్లంపల్లి పట్టణంలోని 27వ వార్డు హనుమాన్ బస్తీ చౌరస్తా గ్రంథాలయం ముందు ఉన్న తెలుగుదేశం పార్టీకి చెందిన జెండాను, బూడిద గడ్డ నీళ్ల ట్యాంక్ దగ్గర వినాయక మండపానికి దగ్గర్లో ఉన్న తెలుగుదేశం పార్టీ జెండాను గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ ఉపాధ్యక్షుడు బొల్లు మల్లయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి ఓ జీవరత్నం, మండల ఉపాధ్యక్షుడు గద్దెల నారాయణ, సిహెచ్ రమేష్, ఎం గోపాల్, బి సత్యనారాయణ, గైని తిరుపతి, ఎస్కె అస్గర్ భాష, ఆర్ గంగాధర్ గౌడ్, నారాయణ, రాజయ్య, ముస్లిం మైనార్టీ నాయకులు ఎండి హసన్, ఎస్ రవి, మేకల నర్సింగ్, పోతుల రాములు పాల్గొన్నారు.



## పెళ్లిరోజు సందర్భంగా దేవాలయంకు నల్లాలు వితరణ

**దశ, సూర్యాపేట ప్రతినిధి:** సూర్యాపేట జిల్లా కేంద్రం విద్యానగర్ లోని శ్రీ రామలింగేశ్వర సహిత త్రిశక్తి ఆంజనేయ, అయ్యప్ప స్వామి దేవాలయంకు శ్రీరామ్ నగర్ కు చెందిన చింతరెడ్డి పాపిరెడ్డి, వెన్నెల దంపతులు ఆదివారం ట్యాప్స్(నల్లాలు) వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, అర్చకులు దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## కగారకు వ్యతిరేక సదస్సును అడ్డుకోవడాన్ని ఖండిస్తున్నాం

**దశ సూర్యాపేట ప్రతినిధి:** వరంగల్ లో ఆదివాసీల హక్కుల వేదిక, ప్రజా సంఘాల వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర సదస్సుని నిర్వహించ తలపెట్టిన సభను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతులు రద్దు చేయడం అప్రజా స్వామికమని ప్రజా



సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎల్. భద్రయ్య, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి మాండారి డేవిడ్ కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు లు అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో వరంగల్ లో జరిగే సభకు అనుమతులు రద్దు చేయడానికి వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక చర్యలను రాష్ట్రంలో ఉన్న అన్ని వర్గాల ప్రజలు ఖండించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకుడు నారబోయిన వెంకట యాదవ్, నల్లెడ మాధవరెడ్డి, రేపాక లింగయ్య, బుద్ధ సత్యనారాయణ, చామకూరి నరసయ్య, గంట నాగయ్య, పిడమర్తి భరత్, దేశోజు మధు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు వెంటనే మంజూరు చేయాలి: బీజేపీ



**దశ, హుజురాబాద్:** ప్రజాధనంతో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిరుపయోగంగా ఉండి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారుతున్నాయని, వాటిని తక్షణమే నిరుపేద కుటుంబాలకు మంజూరు చేయాలని బీజేపీ హుజురాబాద్ పట్టణ అధ్యక్షులు తుర్పాటి రాజు డిమాండ్ చేశారు. హుజురాబాద్‌లోని పాత శిశు మందిర్‌లో ఆదివారం నిర్వహించిన సీనియర్ నాయకుల సమావేశంలో తుర్పాటి రాజు మాట్లాడుతూ, హుజురాబాద్ శివారులోని గణేష్ నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఎలాంటి రాజకీయ ప్రమేయం లేకుండా అధికారుల పర్యవేక్షణలో అర్హులైన పేదలకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ రావుల వేణు, జిల్లా కార్యవర్గ సభ్యులు తూముల శ్రీనివాస్, సీనియర్ నాయకులు సుమన్, సబ్బని రమేష్, శశిధర్, నరాల రాజశేఖర్, గంట సంపత్, సారయ్య, కోలిపాక వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ అనివార్యం: జి. దేవేందర్

**దశ, మంచిర్యాల / మందమర్రి :** ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ అనివార్యమని సింగరేణి ఏరియా జిఎం జి దేవేందర్ తెలిపారు. ఏరియాలోని సింగరేణి సివిల్ విభాగంలో ఇంజనీర్ (ఎస్ఈ) గా విధులు



నిర్వహిస్తూ, ఈనెల పదవీ విరమణ పొందబోతున్న జయప్రకాష్ సన్మాన కార్యక్రమం ఆదివారం పట్టణంలోని ఇల్లందు క్లబ్ లో నిర్వహించగా, ఈ కార్యక్రమానికి సింగరేణి ఏరియా జిఎం జి దేవేందర్, సింగరేణి సేవా సమితి ఏరియా అధ్యక్షురాలు జి స్వరూప రాణి దేవేందర్, సివిల్ విభాగం అధికారులు హాజరయ్యారు. అదేవిధంగా గుర్తింపు కార్మిక సంఘం ఏఐటియుసి, సిఐటియు వివిధ యూనియన్ నాయకులు, అధికారులు, బంధువులు జయప్రకాష్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఆరోగ్యం పై శ్రద్ధ చూపి, ఎల్లవేళలా ఆయురారోగ్యాలతో జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా సివిల్ డిజిఎం రాము, సివిల్ విభాగం సూపర్వైజర్లు, అధికారులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజాక్షేమం కొరకే ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ

❖ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ అజీమొద్దీన్

❖ రోడ్డు ప్రమాదాలు నివారించడమే లక్ష్యం



**దశ, మంచిర్యాల / మందమర్రి :** ప్రజల క్షేమం కొరకే ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ ఎల్లప్పుడూ పనిచేస్తుందని సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ అజీమొద్దీన్, జిల్లా అధ్యక్షుడు నందిపాట రాజ్ కుమార్ లు తెలిపారు. పట్టణంలోని పాలచెట్టు ప్రాంతంలో గత కొద్ది కాలంగా వరుసగా పడుతున్న వర్షాల కారణంగా గుంతలు ఏర్పడి, ప్రమాదకరంగా మారడంతో ఆదివారం ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గుంతలను తాత్కాలికంగా పూడ్చి వేశారు. ఈ సందర్భంగా అజీమొద్దీన్, రాజ్ కుమార్ లు మాట్లాడుతూ, వర్షాలు కారణంగా పాలచెట్టు ప్రాంతంలో ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా మారడంతో, గుంతలను తాత్కాలికంగా పూడ్చి వేయడం జరిగిందని తెలిపారు. పాలచెట్టు సమీపంలోనే కస్తూర్బా, మోడల్ తదితర ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు తోపాటు ప్రభుత్వ కార్యాలయాలు కలవని, నిత్యం విద్యార్థులు, సింగరేణి కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో ఇదే మార్గంలో ప్రయాణిస్తూ ఉంటారని తెలిపారు. ఒకానొక సమయంలో గుంతలు కనపడక రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని, మరమ్మతులు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు ఓరం కవిరాజ్, సభ్యులు ఎండి జావిద్ పాషా, సుందర్, చందు, దిలీప్, సంజయ్, సాయి తేజ, చిలుముల రాజు, గోపాల్ లు పాల్గొన్నారు.

## పాఠ్యాంశాలలో యోగ విద్యను చేర్చాలి

**దశ సూర్యాపేట ప్రతినిధి :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కె.జి నుండి పి.జి తరగతుల వరకు అన్నిస్థాయిల పాఠ్యంశాలలో యోగ విద్యను ప్రవేశపెట్టి ఆరోగ్య నవభారతాన్ని నిర్మాణం చేయాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ దాచేపల్లి సుధీర్ కుమార్, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు తీకుళ్ళ సాయిరెడ్డి లు అన్నారు. యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ సూర్యాపేట జిల్లా వారి ఆధ్వర్యంలో ఆదివారం స్పందన డిగ్రీ కాలేజిలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఇటీవల ఆదిలాబాద్లో జరిగిన రాష్ట్ర స్థాయి యోగాసన స్పోర్ట్స్ మీట్ లో పాల్గొని నాలుగు గోల్డ్ మెడల్స్ సాధించిన గూడూరు నాగేశ్వర్ రావు, అలాగే దేశగాని ఉపేందర్ ఒక గోల్డ్ మెడల్ సాధించి జాతీయ పోటీలలో పాల్గొనుటకు అర్హత సాధించారని, అందుకు సూర్యాపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ వారిని అభినందిస్తూ ఘనంగా సన్మానించారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత శారీరక, మానసిక దృఢత్వాన్ని, ప్రశాంతతను సాధించాలంటే ప్రతి ఒక్కరు యోగ నేర్చుకొని ప్రతినిత్యం అభ్యాసం చేయాలని వారు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది జె. శశిధర్, మాజీ కౌన్సిలర్ బండపెల్లి పాండు రాగాచారి, అసోసియేషన్ కమిటీ ఉపాధ్యక్షులు సైదులు, పి.డి. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దేశగాని శ్రీనివాస్, జుట్టుకొండ నవీన్, చంద్రశేఖర్, రంగారావు, బానుప్రకాష్, నాగిరెడ్డి, నగేష్, నామాల వీరయ్య, మల్లికార్జున్, భగవాన్ రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

